


యుగ పురుషుడు ఎన్టీఆర్

» జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు

జిల్లాలో టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలు కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు.

- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



ఎన్టీఆర్ విగ్రహంపై పూలు చల్లుతున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుకు భారతరత్న ప్రకటించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా బుధవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మహానాడుకు వెళ్లి స్వయంగా ఆయనకు నివాళులర్పించేవాడినన్నారు. ప్రస్తుతం స్పీకర్ పదవిలో ఉన్నందున ఆ కార్యక్రమానికి హాజరు కాలేదన్నారు. సినిమానటులు చాలామంది ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ ఎన్టీఆర్ ఒరవడి ఎవరికీ రాలేదన్నారు. తాను ఉన్నతమైన స్పీకర్ స్థానంలో ఉన్నానంటే ఆయనే ... మిగతా 6వ పేజీలో

సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం



నక్కపల్లి మండలం వేంపాడులో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

భూసారం పెంపునకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు

» రైతులకు 50 శాతం రాయితీ

» తొలిసారిగా పది కిలోల బస్తాల రూపంలో పంపిణీ

» జిల్లాకు తొలి విడతగా 8,940 బస్తాలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

సేంద్రీయ సాగులో భాగంగా రైతులను రసాయన ఎరువులకు దూరం చేయడంతో పాటు భూసారం పెంపొందించేందుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. తొలిసారిగా జనుము, పిల్లిపెసర, జీలుగు విత్తనాలను పది కిలోల బస్తాల చొప్పున రైతులకు పంపిణీ చేస్తోంది. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా 8,940 బస్తాలను పంపిణీ చేసింది.

రైతులు రసాయన ఎరువులను ఇష్టానుసారంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటోంది. దీని ప్రభావంతో దిగుబడులు తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద తగ్గడంతో భూమికి సేంద్రీయ ఎరువుల వాడకం తగ్గింది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలను వాడాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట విత్తనాల వల్ల నేలలో మొక్కకు భాస్వరం, పొటాస్ అందడమే కాకుండా గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తద్వారా సూక్ష్మపోషకాలు మొక్కలకు అంది పంట దిగుబడులు పెరుగుతాయి. ఒక బస్తా ఎకరా పొలానికి వినియోగించాలని



పచ్చిరొట్ట విత్తనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు ఈ ఏడాది 894 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో జీలుగు 450 క్వింటాళ్లు, జనుము 332 క్వింటాళ్లు, పిల్లిపెసర 112 క్వింటాళ్లు ఉన్నాయి. ఇప్పటికే కృషి యాప్ ఆధారంగా మండలాల ఇండెంట్ ప్రకారం రైతు సేవా కేంద్రాల ద్వారా వీటి పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. కృషి యాప్‌లో నమోదు చేసుకున్న ఒక రైతుకు గరిష్ఠంగా 5 ఎకరాల వరకు మాత్రమే రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తారు. జిల్లాకు పచ్చిరొట్ట విత్తనాలు పది కిలోల చొప్పున 8,940 బస్తాలు వచ్చాయి.

రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ

జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాలను తొలకరి వర్షాలు కురవడంతోనే విత్తడం ప్రారంభిస్తారు. జీలుగు విత్తనాలు కిలో ధర రూ.123 ఉంది. ప్రభుత్వం 50 శాతం రాయితీ ప్రకటించడంతో రైతుకు కిలో రూ.61.50కి లభిస్తుంది. 10 కిలోల బస్తా రూ.615కి వస్తుంది. జనుము కిలో ధర రూ.109 ఉండగా, రాయితీ పోను రూ.54.50కి అందిస్తారు. 10 కిలోల బస్తా ధర రూ.545కి రైతుకు లభిస్తుంది. పిల్లిపెసర విత్తనాలు కిలో రూ.180 ఉండగా, రాయితీ పోను రైతుకు రూ.90కి అందజేస్తున్నారు. 10 కిలోల బస్తా రూ.900కు రైతుకు అందిస్తారు.

విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

జిల్లాకు మొదటి విడత కింద జీలుగు, జనుము విత్తనాలు మంజూరయ్యాయి. వీటిని రైతులకు 50 శాతం రాయితీపై విక్రయిస్తాం. ఇప్పటికే కొన్ని మండలాల్లో పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో అన్ని రైతు సేవా కేంద్రాలలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు తమకు సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి కృషి యాప్‌లో వివరాలు నమోదు చేసుకొని పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చు.

- బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

సినిమా థియేటర్లలో తనిఖీలు

» లైసెన్స్‌లు, సౌకర్యాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

» తినుబండారాల ధరలపై ఆరా



నర్సీపట్నం పీవీఆర్ కాంప్లెక్స్‌లోని తినుబండారాల స్టాల్ వద్ద ఎంఆర్‌పీ ధరలు తనిఖీ చేస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని నర్సీపట్నం, పాయకరావుపేటలో గల సినిమా థియేటర్లను బుధవారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. నర్సీపట్నంలో సినిమా థియేటర్లను ఆర్డీవో వీవీ రమణ.. తహసీల్దార్ రామారావుతో కలిసి తనిఖీలు చేశారు. బుధవారం ఫస్ట్ షో సమయంలో స్థానిక పీవీఆర్ కాంప్లెక్స్‌లోని నాలుగు థియేటర్లు, రాజు, బంగార్రాజు థియేటర్లను తనిఖీ చేశారు. థియేటర్ లేఅవుట్, ప్లాన్ వివరాలు అడిగి తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. బయకు వచ్చే మార్గాలు, అగ్నిమాపక పరికరాలు, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించారు. తినుబండారాలు, వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్‌లు విక్రయించే షాపులో ఎంఆర్‌పీ ధరలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వీవీ రమణ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఆరు సినిమా థియేటర్లను తనిఖీలు చేశామని తెలిపారు. నిబంధనల ప్రకారం నడుపుతున్నారా?, లేదా అని పరిశీలించామన్నారు. నివేదికను ప్రభుత్వానికి పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: పట్టణంలోని సినిమా థియేటర్లను బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. తహసీల్దార్ జి.ఆనంద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పట్టణంలోని గౌతమ్, చిత్రమందిర్, శ్రీలక్ష్మి థియేటర్లలో లైసెన్స్‌లు, సదుపాయాలు, టికెట్ల రేట్లు, క్యాంటీన్ రేట్లు, మరుగుదొడ్లు, అగ్నిమాపక పరికరాలు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్వో వెంకటేశ్, జూనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, తదితరులున్నారు.

ఉపాధి శ్రామికుల ఆకలి కేకలు

» ఏడు వారాల నుంచి వేతనాలు అందక ఇబ్బందులు



డి.యర్రవరంలో ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

నాతవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడు వారాల నుంచి వేతనాలు అందక ఉపాధి హామీ పథకం శ్రామికులు అవస్థలు పడుతున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వారం రోజుల్లోనే వేతనాలు చెల్లించే వారని, ఇప్పుడు సకాలంలో చెల్లించడం లేదని వాపోతున్నారు. మండలంలో ప్రస్తుతం 10,200 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. గత ఏప్రిల్ నుంచి ఈ నెల 28 వరకు సుమారు రూ.5.5 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని శ్రామికులు చెబుతున్నారు. సకాలంలో వేతనాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కృష్ణారావు



డాక్టర్ కృష్ణారావును అభినందిస్తున్న వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్‌గా సీనియర్ వైద్యులు, ఈఎన్‌టీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ కె.కృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా ఉన్న ఎస్.శ్రీనివాసరావు నుంచి కృష్ణారావు బాధ్యతలు చేపట్టారు. గతంలో అనకాపల్లిలో విధులు నిర్వహించిన కృష్ణారావు ఇప్పటి వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్, పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల ఆయన అనకాపల్లికి బదిలీపై వచ్చారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణారావు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. కృష్ణారావును పలువురు వైద్యులు, సిబ్బంది, నర్సులు అభినందించారు.

జిల్లాలో ముసురు

పలు మండలాల్లో తేలికపాటి జల్లులు

» గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న చెరువులు, గెడ్డలు

అనకాపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం ముసురు వాతావరణం నెలకొంది. పలు మండలాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో జనం విలవిల్లాడారు. సాయంత్రం పలు చోట్ల ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడ్డాయి. దీంతో జనం ఉపశమనం పొందారు.

ఉప్పొంగిన వాగులు

బుచ్చెయ్యపేట: జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తు న్నాయి. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది పెద్దేరు కాజ్‌వే పైనుంచి వర్షపు నీరు బుధవారం ఉధృతంగా ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం భారీ వర్షం కురిసి వరద నీరు ఉధృతంగా రావడంతో పెద్దేరు నీటిని విడుదల చేశారు. దీని వల్ల నీటి ప్రవాహానికి చెత్తాచెదారం కాజ్‌వే పైపులకు అడ్డంగా ఉండిపోవడంతో వర్షపు నీరు కాజ్‌వే పైనుంచి ప్రవహించింది.

పొంగి ప్రవహిస్తున్న చెరువులు

నాతవరం: మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాతవరంలోని సాగునీటి చెరువులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. నాతవరం దాలమ్మ చెరువు ఈ వర్షాలకు పూర్తిస్థాయిలో నిండడమే కాకుండా మూడు రోజుల నుంచి పొంగి ప్రవహించడంతో దిగువ ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరినారు మడులను సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు తగ్గి పొలాల్లో పదును తగ్గితే వరినారు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. అలాగే నాతవరం పెద్ద చెరువులో వర్షాలకు నీరు చేరడంతో మినీ రిజర్వాయర్‌ను తలపించేలా ఉంది. ఈ ఏడాది వర్షాల వలన సాగునీటి చెరువుల్లో నిండా నీరు చేరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వడ్డాది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



పొంగి ప్రవహిస్తున్న నాతవరంలోని దాలమ్మ చెరువు



నిండు కుండలా రైవాడ జలాశయం

రైవాడకు జలకళ

దేవరాపల్లి: మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైవాడ జలాశయంలోకి వరద నీరు చేరుతోంది. మంగళవారం రాత్రి నాలుగు సెంటీమీటర్లు వర్షం పడడంతో సమ్మెద గెడ్డ, పీన కోట గెడ్డల నుంచి జలాశయంలోకి ఐదు వందల క్యూసెక్కుల వరద నీరు చేరింది. మంగళవారం 110.80 మీటర్లు నీటిమట్టం కాగా, బుధవారం సాయంత్రానికి 111 మీటర్లకు చేరింది. చెరువుల్లో, పొలాల్లో స్వల్పంగా నీరు చేరింది.

కొండకర్ల ఆవకు మహర్దశ

» పరిరక్షణ ప్రాంతంగా ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పర్యాటకంగా అభివృద్ధి



అచ్యుతాపురం మే 28 (ఆంధ్రజ్యోతి):

కొండకర్ల ఆవకు మహర్దశ పట్టనుంది. కొండకర్ల లోవను వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972 కింద కన్జర్వేషన్ రిజర్వుగా (పరిరక్షణ ప్రాంతం) ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యంత పెద్ద మంచినీటి సరస్సుగా పేరొందిన కొండకర్ల ఆవ సముద్ర మట్టానికి 16.23 మీటర్ల ఎత్తులో వుంది. 1,863 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ ఆవ నీటి నిల్వ సామర్థ్యం 180.9 మిలియన్ క్యూబిక్ అడుగులు(ఎంసీఎఫ్‌టీ). ఆవ ఆయకట్టు 1,927 ఎకరాలు. ఆవ వైశాల్యం 14 కిలోమీటర్లు. ఆవ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1839 మార్చి 31న ఒక జీవో విడుదల చేసింది. దీని ప్రకారం శారదా నది నుంచి కృష్ణంరాజు కాలువ (గొడారి ఆనకట్ట) ద్వారా ఏటా జూన్ ఒకటి నుంచి డిసెంబరు 14 వరకు కొండకర్ల ఆవలోకి నీటిని పంపాలి. అయితే కృష్ణంరాజు కాలువ ద్వారా వచ్చిన నీటిని వారంలో మూడున్నర రోజులు కృష్ణంరాజు కాలువ నీటి సంఘం ఆధ్వర్యంలో గల భూములకు వినియోగించుకొని, మిగతా మూడున్నర రోజులు కొండకర్ల ఆవలోకి నీటిని వదలాలి. ప్రతి సంవత్సరం డిసెంబరు 15 వరకు నీటిని ఆవలోకి పంపుతారు. అయితే ఆవలో ఆరున్నర అడుగుల రీడింగ్ వరకు మాత్రమే నీటిని నిల్వ చేయాలి. ఆపై వచ్చిన నీటిని కళింగ లాకుల ద్వారా దిగువ ప్రాంతాలకు విడిచిపెట్టాలి. ఆవ పూర్తిగా నిండితే సుమారు 20 అడుగుల లోతున నీరుంటుంది. అయితే హరిపాలెం వద్ద నిర్మించిన ప్రధాన రెగ్యులేటర్ వద్ద జీరో రీడింగ్ వచ్చే వరకు పంట పొలాలకు నీటిని విడిచిపెట్టవచ్చు. అయినప్పటికీ ఆవలో 10 నుంచి 15 అడుగుల మేర నీరుంటుంది.

వంద ఎకరాలు ఆక్రమణ

కొండకర్ల ఆవ గర్భంలో సుమారు వంద ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. కబ్జాదారులు వరి, చెరకుతో పాటు దీర్ఘకాలిక పంటలైన సరుగుడు, కొబ్బరి కూడా పండిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం జూన్ ఒకటి నుంచి డిసెంబరు 14 వరకు శారదా నది నుంచి నీటిని కొండకర్ల ఆవకు పంపాలి. కానీ నీటిని ఆవలోని పంపితే ఆవ గర్భంలో ఆక్రమించిన భూముల్లో పంటలు మునిగిపోతాయన్న ఉద్దేశంతో శారదానది నీటిని ఆవలోకి పంపడం లేదు. ఆవలో ఇంతవరకు పూడిక తీయలేదు. దీంతో పూడిక పెరిగిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ఆవ పరిరక్షణకు బ్రిటిష్ హయాం నుంచి అమలవుతున్న జీవోలను అధికారులు తుంగలో తొక్కారు. ఆవ ... మిగతా 6వ పేజీలో

జనవాణి అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

▸▸ అధికారులకు ఎమ్మెల్యే విజయకుమార్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే జనవాణి అర్జీలను సకాలంలో పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే జనవాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. జనవాణి కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెన్షన్లు అందిస్తున్నామని, ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, తహసీల్దారు వరహాలు, అధికారులు, జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, వైస్ ఎంపీపీ రాజాన శేషు, నేతలు పిట్టా శ్రీను, కర్రి ఝాన్సీ పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన

అచ్యుతాపురం రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తి పెరగడానికి పాడి రైతులు పాటించాల్సిన పద్ధతులను నేర్చుకోవాలని హరిపాలెం గ్రామపెద్ద మారిశెట్టి సూర్యనారాయణ అన్నారు. హరిపాలెంలో బుధవారం జరిగిన హెరిటేజ్ పాడి రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హెరిటేజ్ డెయిరీ మేనేజరు కూండ్రపు శేషు ఉత్తమ పాడి రైతులకు సన్మానించి, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

కొత్తూరులో సంపద కేంద్రాన్ని పరిశీలించిన డీపీఓ



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

రాంబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు చెత్త సంపద కేంద్రాన్ని బుధవారం జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి పరచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానపాముల తయారీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంపద కేంద్రాల ఉపయోగాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్డీ రాజు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాంబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో జయమాధవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని తుఫాన్ భవనం వద్ద రెండో రోజు బుధవారం యోగాంధ్ర శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజు, వెలుగు ఏపీఎం పద్మ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



ఎలమంచిలిలో ఎన్టీఆర్ జయంతిని జరుపుకుంటున్న నేతలు



మునగపాక ఎన్టీఆర్ విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో టీడీపీ శ్రేణులు

ఎలమంచిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ పట్టణ కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి, నేతలు బొద్దపు శ్రీను, ఆడారి రమణబాబు, పిల్లా ఆదిబాబు తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు నమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: స్వర్గీయ నందమూరి తారకరామారావు 102వ జయంతి మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట, చూచుకొండ, గవర్ల అనకాపల్లి, మూలపేట, వాడ్రాపల్లి, వెంకటాపురం తదితర గ్రామాల్లో బుధవారం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు ఆడారి మంజు, మొల్లేటి సరళ, దాడి అప్పలనాయుడు, దాడి శివ, ఉల్లింగల గోవింద, ఆడారి కన్నబాబు, బీలా లక్ష్మణరావు, కాండ్రేగుల నాయుడు, పొలమరశెట్టి మురళీకృష్ణ, మళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎల్వీ.రమణ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. పలువురు పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

రాంబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు, మండల పరిషత్ అధికారులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకుడు వి.దిన్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, జనసేన మండల శాఖ అధ్యక్షులు పప్పల నూకన్నదొర, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె.రఘు, మాజీ సర్పంచులు చోడిపల్లి సత్యనారాయణ, కర్రిసింహగిరి ప్రసాద్, బద్ది నారాయణరావు, బాబూరావు, డి.రమేష్, కూటమి నేతలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని హరిపాలెం, యర్రవరం, మల్లవరం, ఎం.జగన్నాథపురం, ఉప్పవరం, పూడిమడక, మడుతూరు, మోసయ్యపేట తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.సూర్యనారాయణ, బాపునాయుడు, జోగినాయుడు, ఎస్.అప్పారావు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో లోకేశ్‌ను కలిసిన ప్రగడ



మహానాడులో మంత్రి లోకేశ్‌ను కలిసిన ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడులో బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గం అభివృద్ధి కోసం చర్చించారు. మహానాడులో మాట్లాడే అంశాలను నియోజకవర్గ స్థాయిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం రోడ్, అచ్యుతాపురం, మోసయ్యపేట బర్మాకాలనీ, చోడపల్లి, మోసయ్యపేట, రామన్నపాలెం, కొత్తూరుమోసయ్యపేట, వెంకటాపురం జంక్షన్, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భవనంలోకి సబ్ సెంటర్

మునగపాక, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనంలోకి వైద్య సబ్‌సెంటర్‌ను మార్చడం సంతోషకరమని మాజీ ఎంపీ ఆడారి మంజు అన్నారు. బుధవారం తిమ్మరాజుపేటలో సబ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న అదనపు గదిలోకి మార్చడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శరగడం అప్పలనర్స, బీమిశెట్టి కృష్ణారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బీవీరమణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు

రాంబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలు అందించేందుకు మండలంలోని హరిపురం బీసీటీలో బుధవారం డాక్టర్లు కొలతలు తీశారు. బీసీటీ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏఎంటిజడ్ వారి సహకారంతో రాంబిల్లి, ఎలమంచిలి, అచ్యుతాపురం, మునగపాక, ఎస్.రాయవరం మండలాలకు చెందిన 50 మంది దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందించేందుకు కొలతలు తీశారు. ఈ సందర్భంగా బీసీటీ ట్రస్టు సెక్రటరీ బి. శ్రీరామూర్తి మాట్లాడుతూ చెవుడు, మూగ, వినికిడి శక్తి కోల్పోయిన వారికి కూడా వినికిడి పరికరాలు అందించేందుకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో బీసీటీ కేంద్ర సమన్వయకర్త కె.సీతారామరాజు, సామాజిక కార్యకర్తలు ఎస్.నాగేశ్వరరావు, వీఏ నాయుడు, ఎస్వీ.రమణ, పాల్గొన్నారు.

రైతులకు కిట్లు, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

రాంబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబోలు, మర్రిపాలెంల్లోని రైతులకు పీఎండిఎస్ కిట్లు, పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం అందజేసినట్టు మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత తెలిపారు. మర్రిపాలెంలో 45 మందికి, కట్టుబోలులో 40 మంది రైతులకు కిట్లును అందజేశామన్నారు. కార్యక్రమంలో వీఏఏ రామారావు, ఎంపీఈఓలు ప్రశాంతి, శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎలమంచిలిని అగ్రభాగాన నిలుపుతా..

▸▸ ఎమ్మెల్యే విజయకుమార్.. ▸▸ డిగ్రీ కళాశాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా మారుస్తా..



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన నిలపడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే ఉద్దేశంతో నిత్యం ప్రజల మధ్యే ఉంటూ పాలన సాగిస్తున్నామన్నారు. అమృత్ 2.0 లో భాగంగా ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి పరిష్కారానికి నోచుకోని యానాద్రి కాలువ ఆధునికీకరణ పనులను ప్రారంభించామని విజయకుమార్ అన్నారు. ఇంకా నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎలమంచిలిలో ప్రభుత్వ హైస్కూలు, జూనియర్, డిగ్రీ కళాశాలలను మరింత అభివృద్ధి పథాన నిలుపుతానన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని ప్రకటించారు. డిగ్రీ కళాశాలలో మరో 18 తరగతి గదుల నిర్మిస్తామని, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై లారస్ పరిశ్రమతో ఎంవోయూ కుదుర్చుకుంటామన్నారు. ఇక్కడ చదివిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే విధంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. కళాశాల క్రీడా మైదానంలో గంజాయి, మద్యం సేవించడాన్ని కట్టడి చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంతి పవన్ కల్యాణ్ మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా మన పరిసరాల్లో నివాసం ఉంటున్నా, సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రాయితీపై అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

మునగపాక, మే 28 (ఆంధ్రజ్యోతి): అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే వినియోగదారులు 50 శాతం రాయితీ పొందవచ్చునని స్థానిక ఈపీడీసీఎల్ ఏఈ శరగడం జగదీష్ అన్నారు. ఒక కిలోవాట్ లోడ్‌కు ప్రస్తుతం డెవలప్‌మెంట్ చార్జీ రూ.2,250 చెల్లించాల్సి ఉందని, అటువంటి వారు రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మూడు కిలోవాట్లకు రూ.6,650లకు రూ.3,650, 5కిలోవాట్లకు రూ.11,050లకు రూ.6,050లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల 30వ తేదీ వరకు గడువు ఉన్నందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ కనెక్షన్‌లు ఎంతో లాభదాయకమని, ప్రభుత్వం ఇస్తున్న రాయితీని వినియోగించుకోవాలన్నారు. లో-ఓల్టేజ్ సమస్యను గుర్తించి అదనపు ట్రాన్స్‌ఫారమ్‌లు వేయడం జరుగుతుందన్నారు.



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌డీ అనిత

బల్క్ డ్రగ్ పార్కు భూసేకరణపై సమీక్ష

నక్కపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏర్పాటుకానున్న బల్క్ డ్రగ్ పార్కుకి అవసరమైన అధనపు భూమి కోసం బుధవారం ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌డీ.అనిత స్థానిక రైతులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని పెదతీనార్ల రైతులతో భూసేకరణ, తగిన నష్టపరిహారం తదితర అంశాల గురించి త్వరలో సమావేశం నిర్వహిస్తామని ఆమె చర్చించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ

ఎస్.రాయవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్టేషన్‌ను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. స్థానికంగా జరిగే పలు విషయాలపై ఎస్సై విభీషణరావు, నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు.

ఎన్టీ రామారావుకు ఘన నివాళి

పాయకరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలు బుధవారం పాయకరావుపేటలో టీడీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వై జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఎన్టీఆర్ చిత్ర పరిశ్రమకు, రాష్ట్రానికి చేసిన సేవలను తెలియజేశారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు 102వ జయంతి వేడుకలను టీడీపీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాల్తేరులో టీడీపీ నాయకుడు దేవవరపు వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడకలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యవరం, మాసాహెబ్‌పేట, శ్రీరాంపురం గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేస్తున్న పార్టీ శ్రేణులు

కోటవురట్లలో..

టీడీపీ వ్యవస్థపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102 రోజున పుట్టిన రోజు వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండలంలో జల్లూరు దగ్గర గ్రామసర్పంచ్ లాలం పద్మావతి, కైలాసపట్నం, కోటవురట్ల జంక్షన్‌లో బుధవారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని కొనియాడారు. ఎన్టీఆర్ హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం ఎస్. రాయవరంలో టీడీపీ సీనియర్ నేత కందుల వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కోటవురట్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ లాలం పద్మావతి, తదితరులు

నిండుకుండలా తాండవ



నీటి ప్రవాహంతో కళకళలాడుతున్న తాండవ నది

పాయకరావుపేట రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు బుధవారం తాండవ నదిలో నీరు చేరి నిండుగా ప్రవహిస్తోంది. ఈ ఏడాది వర్షాకాలానికి ముందుగానే అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో తాండవ నదిలో నీరు పెరుగుతోంది. ఎన్నో సంవత్సరాల తరువాత మే నెలలో తాండవనది నిండుగా ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు దుక్కులు దున్ని వరిసాగుకు సిద్ధమవుతున్నారు.

ఏషియన్ కరాటే చాంపియన్‌షిప్‌లో మెరిసిన 'పేట' విద్యార్థి



ధూళి అంజనాశ్రీవేణి

పాయకరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలే శ్రీలంకలో జరిగిన ఏషియన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-12 విభాగంలోని పాయకరావుపేటకు చెందిన ధూళి అంజనా శ్రీవేణి రజత పథకాన్ని సాధించి సత్తాచాటింది. బుధవారం స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు వివరాలు అందజేస్తూ కొలంబోలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన 9వ ఏషియన్ గోజుర్యు కరాటే చాంపియన్‌షిప్ (ఏజీకేఎఫ్-2025) పోటీల్లో తమ విద్యార్థి పాల్గొని రజత పతకం సాధించిందని చెప్పారు. ఈ పోటీల్లో ఇండియాతోపాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, కజకిస్థాన్, తజకిస్థాన్, ఫిలిప్పీన్స్, మలేషియా, నేపాల్, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా వంటి ఆసియా దేశాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారని, అంజనాశ్రీవేణి అద్భుత ప్రదర్శనతో రజతం సాధించడం గర్వించతగ్గ విషయమని పేర్కొన్నారు. చక్కటి ప్రతిభ కనబర్చిన అంజనాశ్రీవేణిని తమిళనాడు కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు షీహాన్ ప్రమోష్ అభినందనలు తెలియజేశారు.

యోగాంధ్ర శిక్షణకు విశేష స్పందన

▸▸ జూన్ 21 నాటికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

▸▸ యోగా శిక్షణలో ఉత్సాహంగా పాల్గొంటున్న ఉద్యోగులు

▸▸ ఒక్కొక్కరు కనీసం 50మందికి శిక్షణ ఇవ్వాలని సూచనలు



ఉపమాకలో యోగా శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పాయకరావుపేటలో ఉద్యోగులకు యోగాంధ్ర ప్రోటోకాల్ శిక్షణ నిర్వహిచారు. ఈ సందర్భంగా స్థానిక వీఆర్ అతిథిగృహం ఆవరణలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు మాట్లాడుతూ యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు ప్రతిఒక్కరు గ్రామాల్లో కనీసం 50 మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ పద్మావతి, యోగా గురువు కేఎస్ఎన్.మూర్తి ఉద్యోగులకు పలు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు.



కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో యోగా చేస్తున్న అధికారులు

నక్కపల్లిలో...

మండలంలోని ఉపమాక వెంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర బుధవారం నిర్వహించిన యోగాంధ్ర మండల స్థాయి ప్రోటోకాల్ యోగా శిక్షణ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఎంపీడీఓ డి.సీతారామరాజు, ఆయుర్వేద వైద్యుడు కె.రఘు, ఎంఈఓ కె.నరేశ్ యోగాంధ్ర కార్యక్రమం గురించి వివరించారు. ప్రోటోకాల్ యోగాంధ్ర శిక్షణా తరగతులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని ఒక్కొక్కరు కనీసం 50 మందికి యోగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. యోగా గురువు దవరసింగి రాంబాబు, ట్రైనర్లు ఉద్యోగులకు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు.

కోటవురట్లలో..

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కోట్టవురట్ల హైస్కూల్ ఆవరణంలో బుధవారం ప్రభుత్వ ఉద్యోగులకు యోగా ప్రోటోకాల్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, తహశీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ నాలుగురోజులపాటు నిర్వహించే ఈశిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు ఒక్కొక్కరూ కనీసం 50 మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు

పాయకరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని ప్రయాణికులకు తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం ఎలమంచిలి, తుని, అన్నవరం రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయడం తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ శక్తి యాప్‌తో ప్రతి మహిళకు ఆపద సమయంలో ఒక ఆయుధంగా పనిచేస్తుందని అన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ యాప్‌ద్వారా 100, 112, 139, ఎస్ఓఎస్ బటన్ నొక్కి ఫిర్యాదు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. రైలు ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ సిబ్బంది పాల్గొన్నాది.

సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ

ఎస్.రాయవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం, వెలుగు సమావేశ మందిరాల్లో బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి యోగా ఆసనాలపై శిక్షణ ఇచ్చారు.

యోగా నిర్వహణకు కొత్తూరు ఫణిగిరి పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జూన్ 9వ తేదీన కొత్తూరు బౌద్ధక్షేత్రం ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం డీపీఓ శిరీషారాణి, ఎంపీడీవో జయమాధవిలతో ఆయన కొత్తూరు ఫణిగిరిపై ఉన్న బౌద్ధక్షేత్ర ఆవరణాన్ని పరిశీలించారు. యోగా దినోత్సవం రోజు 3వేలు మంది కార్యక్రమానికి హాజరవుతారని అన్నారు. ఇప్పటికే యోగాంధ్రపై మండలాల్లోని శాఖలపరంగా ఉద్యోగులకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజు, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు


అనకాపల్లి జనసేన కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి


తుమ్మపాల గ్రామంలో...


కడప మహానాడులో కేక్‌కట్ చేస్తున్న గండి బాబ్జీ తదితరులు

తెలుగు తేజానికి నీరా'జనం'

▸ వాడవాడలా ఘనంగా ఎన్టీఆర్ జయంతి ▸ విగ్రహాలు, చిత్రపటాలకు టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులు


కశింకోటలో ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాల వద్ద వేడుకలు నిర్వహిస్తున్న తెలుగు తమ్ముళ్లు

అనకాపల్లి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం ఆ పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. అనకాపల్లి లక్ష్మీనారాయణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో, ఎన్టీఆర్ స్టేడియం వద్ద గల విగ్రహానికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తన నటన ద్వారా తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నతుడు ఎన్టీఆర్ అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ముఖ్యమంత్రిగా ప్రజారంజక పాలన అందించారని కొనియాడారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి కోట్ని రామకృష్ణ, పార్లమెంట్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్మోహన్, కార్యదర్శి మళ్ల గణేష్, భోగలింగేశ్వర ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ జంక్షన్‌లోని గల విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో గర్భిణులకు, బాలింతలకు, రోగులకు పండ్లు రొట్టెలను పార్టీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, పచ్చికూర రాము, కొణతాల రత్నకుమారి, బొడ్డేడ మురళీ, శెట్టి వెంకటరమణలు పంపిణీ చేశారు. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి సమీపంలో అనకాపల్లి జిల్లా కమ్మాస్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి సంఘ అధ్యక్షులు కాకర్ల రమేష్, ప్రధాన కార్యదర్శి కొల్లి శ్రీనివాస్, కోశాధికారి ధనాల వెంకటరావు, గౌరవాధ్యక్షులు రాఘవరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేలాది మందికి 16 రకాల పదార్థాలతో అన్నసమారాధన జరిపారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ వేడుకలను జరిపారు.

కొత్తూరు : అనకాపల్లి పట్టణం రింగురోడ్డు కూడలిలో ఉన్న జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే, సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతిలో టీడీపీ సీనియర్ నాయకుడు రేఖా రమణమూర్తి, కూటమి నాయకులు ఉరిగిటి శ్రీరాములు, గోవిందరావు, బాలిబోయిన సత్యారావు, నూకసూరిఅప్పలరాజు, శ్రీనివాసరావు, రామకృష్ణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు


పరవాడలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు తదితరులు

తుమ్మపాల : అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, దిబ్బపాలెం, బవులువాడ, మార్టూరు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి ఆయన విగ్రహాలకు పలు చోట్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఆడారి గోవిందరావు, పెతకంశెట్టి బలరాం, పీలా సీతారాం, సందిన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కశింకోటలో ఉన్న బసవతారక రామారావు విగ్రహాల పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకుడు కాండ్రేగుల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు బట్టలు పంపిణీ చేశారు. నర్సింగబిల్లిలో, బయ్యవరం బస్ స్టాండ్, కన్నూరుపాలెం గ్రామ సచివాలయంలో ఈ వేడుకను జరిపారు. నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తాకాశి కృష్ణ, వేగి వెంకట్రావు, నర్సింగరావు, పెదపాటి కళ్యాణి, ఉగ్గిన రమణమూర్తి, ఎస్.కె.బాబర్, నాగరాజు, చిరంజీవి, నూకునాయుడు, చుక్క అప్పలనాయుడు, కూండ్రపు వెంకునాయుడు, చుక్క ప్రసాద్, ప్రదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు అన్నారు. పరవాడలో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ జయంతిలో మాట్లాడారు. తొలుత స్థానిక సంతబయలు వద్ద గల ఆయన కాంస్య విగ్రహానికి పైలా పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు అట్టా సన్యాసిఅప్పారావు, బొడ్డపల్లి అప్పారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు పైలా చినఅక్కునాయుడు, పైలా బుజ్జి, వర్రి చంద్రశేఖర్, పైలా కృష్ణ, గండి మహేశ్, పైలా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వెన్నెలపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీటీసీ మాజీ పైలా రథాల సన్యాసిరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. నాయకులు బోజంకి నాయుడు, లోకిరెడ్డి అభిసన్యాసినాయుడు, పైలా వరలక్ష్మి, గొంప మారునాయుడు, బండారు వీరునాయుడు, వాసిరెడ్డి ఈశ్వరరావు, బండారు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : ఎన్టీఆర్ జయంతిని మండలంలో వాడవాడలా టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సబ్బవరంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో పలువురు ఎన్టీఆర్ విగ్రహానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు పెద్దాడ రమణమ్మ ఎన్టీఆర్ జన్మదిన కేక్ కట్‌చేశారు. నాయకులు భరణికాన బాబూరావు, గండి దేముడు, బొండా సత్యారావు, కొటాన అప్పారావు, రోమాల చంద్రశేఖరరావు, పల్ల తాతారావు, గవర అప్పారావు, కరణం రామునాయుడు, కోన సోమేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, గవర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే, 88వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, అసకపల్లిలో సీనియర్ నేత భరణికాన బాబూరావు, గణపతినగర్‌లో జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ ఆధ్వర్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కడపలో జరుగుతున్న మహానాడులో పెందుర్తి నియోజకవర్గ నాయకులు సందడి చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పార్టీ శ్రేణులతో కలిసి అక్కడ ఎన్టీఆర్ జన్మదిన కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు పీబీవీఎస్ఎన్ రాజు, గండి వంశీదీప్, తమరాన బంగారునాయుడు, కన్నూరి వెంకటరమణ, వియ్యపు చిన్నా, దాడి కన్నంనాయుడు, బొండా కల్యాణ్, కోరాడ శ్రీను, గొల్లవిల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకం : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యా, సంక్షేమ పథకాల అమలులో సంస్కరణలు తీసుకొచ్చి అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుదని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఎస్‌డీసీలు సుబ్బలక్ష్మి, మనోరమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ...


పోలీస్ కార్యాలంయలో ఎస్పీ తుహిన్‌సిన్హా తదితరుల అంజలి

అనకాపల్లి రూరల్ : ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ హయాంలో ఎన్నెన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి దోహదపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, డీఎస్పీలు విష్ణుస్వరూప్, ఎంవీకే చైతన్య, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'రేషన్ డీలర్లు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి'


ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శేషు తదితరులు

సబ్బవరం, మే 28 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా సేవలందించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డోర్ డెలివరీ (ఎండీయూ) వ్యవస్థను రద్దు చేయడం పట్ల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నంగినారపాడు వచ్చిన ఎమ్మెల్యే పంచకర్లను రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పాక శేషు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థ వలన పౌరసరఫరాల శాఖకు గతంలో చెడ్డ పేరు వచ్చిందని, ఇకపై ఆ పరిస్థితి లేకుండా డీలర్లు సకాలంలో లబ్ధిదారులకు రేషన్ సరకులు అందజేయాలన్నారు. జనసేన నాయకులు ఇందలి వెంకటరమణ, డీలర్ల సంఘం కార్యదర్శ పాపాన ఎల్లాజీ, ఉపాధ్యక్షులు వాసు, కైకాల సన్యాసిరావు, దంగేటి నరేష్, బోకం రామారావు, బండ లక్ష్మి, ఎర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

8న సత్యదేవుని ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

కొత్తూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో హిమగిరిపై కొలువుదీరిన రమాలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో వచ్చే నెల ఎనిమిదో తేదీన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ బుధవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అప్పికొండ గణేశ్, సభ్యులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 191 మంది 'ఆదినారాయణ' కళాశాల విద్యార్థినుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో కళాశాల అధ్యాపక బృందం

అనకాపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదినారాయణ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చూపారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో డిగ్రీ విద్య పూర్తిచేసిన 191 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్, డైరెక్టర్ అనూషా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతలో మార్టూరు గ్రామం ఆదర్శం : డీపీవో

తుమ్మపాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రతలో అనకాపల్లి మండలంలోని మార్టూరును ఆదర్శ గ్రామంగా గుర్తించినట్టు జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి వెల్లడించారు. బుధవారం సదరు గ్రామాన్ని ఆమె సందర్శించారు. సంపద కేంద్రాన్ని సుప్రీం ఎస్‌డబ్ల్యూపీసీగా గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇకపై జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు మార్టూరు ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే గ్రామంలో ఈనెల 30వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఉన్న మార్టూరు పంచాయతీని మెరుగు పరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బందిని సైతం పెంచనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేవీఎస్ రెవెన్యూ నాయుడు, ఎంపీటీసీ మిద్దె రాజా చంద్రరావు, ఉప సర్పంచ్ బేతా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో పంచాయతీ సిబ్బంది, అధికారులతో డీపీవో శిరీషారాణి

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


యోగాసనాలు వేయడంతో శిక్షణ పొందుతున్న మహిళా సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం అనేక ఒత్తిళ్లతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు, సిబ్బందికి యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణి వి. మంగతాయారు అన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి, సాధికారిత అధికారిణి వి.మంగతాయారు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విధి నిర్వహణలో ప్రతి రోజు తీవ్రమైన ఒత్తిడి, సవాల్‌ను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమయంలో మానసికంగా, శారీరకంగా, ధృడంగా ఉండాలంటే యోగా అవసరమన్నారు. ఆయుష్ జిల్లా మెడికల్ ఆఫీసర్ కె.లావణ్య, యోగా గురువులు శ్రీను, చంద్రిక, శివ, సతీశ్, జగన్ తదితరుల మార్గదర్శకాలతో అధికారులు, సిబ్బందికి యోగాసనాల శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అనకాపల్లి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గొలగాం పంచాయతీ శివారు పాత తలారివానిపాలెంలో బుధవారం మోదమాంబ విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజాము నుంచి అమ్మ వారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం మేళతాళాలు, కోలాటాల నడుమ సారెను ఊరేగించి నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవ నిర్వాహకులు నారపిన్ని నానాజీ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్చరీ క్రీడాకారుడికి ఆర్థిక సాయం

పరవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారుడు టి.గణేశ్ మణీరత్నం నాలుగు రోజులుగా పూణేలో నిర్వహిస్తున్న జాతీయ ట్రయల్స్‌లో అర్హత సాధించి కెనడా, సింగపూర్‌లలో జరగనున్న ప్రపంచ చాంపియన్‌షిప్ అండ్ ఆసియాకప్ స్టేజ్-2కి ఎంపికయ్యాడు. ఈ మేరకు అతనికి క్రీడా అవసరాల నిమిత్తం రూ.50వేల ఆర్థిక సాయాన్ని అంజేసినట్టు విశాఖ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు, పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు.

అక్రమ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేత

▸ క్వారీ యజమానుల తీరుపై తహసీల్దార్ ఆగ్రహం

తుమ్మపాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరు రెవెన్యూ పరిధి సర్వే నంబరు 70,74,75లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను తహసీల్దార్ విజయ్‌కుమార్ బుధవారం నిలుపుదల చేశారు. కొంతమంది క్వారీ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా తమ స్వలాభం కోసం, అక్రమ వ్యాపార లావాదేవీల కోసం రోడ్డు నిర్మిస్తున్నారంటూ పలువురు ఫిర్యాదు చేసిన మేరకు ఈ పనులను పరిశీలించినట్టు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని క్వారీ యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ నిర్మాణానికి సంబంధించి పంచాయతీ పాలక వర్గంతో పాటు గ్రామ నాయకుల సైతం ఫిర్యాదులు చేయగా అధికారులు హెచ్చరించినా క్వారీ యాజమాన్యాలు పట్టించుకోక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు తిరిగి ప్రారంభిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'పూర్తిస్థాయిలో ఉపాధి పనులు'

కశింకోట, మే 28 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ఎంపీడీవో వి.వి.రవి కుమార్ ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో 5,600 మందికి ఉపాధి పనులు కల్పించినట్టు చెప్పారు. రైతులకు ఉద్యానవన మొక్కలు కావాలంటే పూర్తి వివరాలు తీసుకొని, అవసరం మేరకు వారికి అందజేయాలన్నారు. ఉపాధి పనులు పక్కాగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో ఎం.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహానాడులో సందడి


చంద్రబాబుకు ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని అందిస్తున్న బుద్ద, చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

అనకాపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కడపలో బుధవారం జరిగిన రెండో రోజు మహానాడు సభలో జిల్లాకు చెందిన పలువురు నేతలు సందడి చేశారు. మహానాడు సభావేదికపై సీఎం చంద్రబాబు నాయుడును మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. మహానాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, అర్బన్, ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రెండో రోజు సభలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టీడీపీ నేతలు


సభలో కార్పొరేషన్ చైర్మన్లు సరేంద్ర, కుమార్, తాతయ్యబాబు



చింతపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ కార్యదర్శి లక్ష్మణరావు, నాయకులు



హుకుంపేటలో ఎన్టీ రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీసీసీ మాజీ చైర్మన్, నాయకులు

బడుగు, బలహీన వర్గాల పెన్నిధి ఎన్టీఆర్

» వాడవాడలా జయంతి వేడుకలు » ఘనంగా నివాళి

అరకులోయ, మే 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన చిరస్మరణీయులని పలువురు అన్నారు. అరకులోయలో తారకరామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపాల్స్ పట్నాని చలపతి రావు, డా.భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను తెలుగుజాతి ఉన్నంత వరకు గుర్తుంచుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఒక భరోసా అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు రీమల ఆనందరావు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, టీడీపీ సీనియర్ నాయకులు లక్కోజు నాగభూషణం, సోమేశ్, అంద్రాబు లక్ష్మణ్, మధు, గంగాధర్, ఈశ్వర్, చంటి, సునీల్, మహేశ్, రమణ, కరం నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కవడం చితుకులయ్యా, వీరబాబు పాల్గొన్నారు.



జీ మాడుగులలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జి. మాడుగులలో..

జి.మాడుగుల: టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు చిత్రపటానికి ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కిముడు కల్యాణం ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయంలో పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నాగబ్బాయి, ఎల్. బాలయ్యదొర, వి. కృష్ణమూర్తినాయుడు, జి. రెడ్డిబాబు, ఎల్.రామకృష్ణ, ఎస్.కొండలరావు, కె.వరప్రసాద్, బి.బాబురావు, కె.వెంకటరమణ, నాగరాజు పాల్గొన్నారు.

సీలేరులో...

సీలేరు : టీడీపీ ఎస్సీ సెల్ పాడేరు నియోజకవర్గం అధ్యక్షుడు చిటికెల రాము ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లోని దుర్గాదేవి షెడ్ వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం తెలుగు మహిళా కార్యకర్తలు కృపా, రాధా తదితరుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె సన్యాసిరావు, ఎస్‌కే నాగూర్‌మీరా, కాశీ, బండారు మారిబాబు, వై నూకరాజు, జనసేన నాయకులు వనముల రాము, వి గోవింద్, బబులా , లక్ష్మణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో..

హుకుంపేట: మండల కేంద్రంలో ఎన్టీఆర్ జయంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహిచారు. ఈసందర్భంగా జీసీసీ మాజీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు మాట్లాడుతూ పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇళ్లు, రేషన్ బియ్యం, పింఛన్లు తదితర వాటిని అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రమ, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు సూర్యకాంతం, మాజీ సర్పంచ్ కామేశ్వరావు, నాయకులు తులసీరావు, అప్పలస్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మణ్, టీడీపీ నేతలు జగన్నాథ్, బి.రామారావు, మజ్జి చిన్ని, బి.గోపాలరావు, కె.బలరాం, బి.కొములు తదితరులు పాల్గొన్నారు.



అరకులోయ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



జీకే వీధిలో..



సీలేరులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఘాట్‌రోడ్డులో విరిగిపడిన ఫైబర్‌నెట్ స్తంభం.. పశువు మృతి



లైడ సమీపంలో మృతిచెందిన పశువు

అనంతగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్‌రోడ్డులోని బుధవారం ఉదయం ఆరు గంటల లైడ సమీపంలోని ఏపీ ఫైబర్ లైన్‌కు చెందిన స్తంభం విరిగిపడడంతో పశువు అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఏజెన్సీకి ఏపీ ఫైబర్‌నెట్ సేవల కోసం ఘాట్‌రోడ్డులోని స్తంభాలను ఏర్పాటు చేసి, కేబుల్ సరఫరా చేశారు. అయితే రోడ్డుకు రక్షణగోడకు మధ్యలో వర్షాలతో రోడ్డంతా కోతకు గురైంది.. దీంతో ఈ స్తంభం విరిగిపడింది. అదే సమయంలోని వాహనాలు వెళ్లి ఉంటే ప్రమాదం సంభవించి ఉండేదని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేశారు. మృతిచెందిన పశువు ఏ రైతుకు చెందినదో తెలియాల్సి ఉంది. ముందస్తు చర్యలో భాగంగా విద్యుత్ స్తంభాలను తొలగించి, రక్షణ గోడ అవతలివైపుగా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆరు బైక్‌లు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

చింతపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ఇద్దరు పాత నేరస్తులను అరెస్టు చేసి, ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నెల రోజులుగా మండలంలో మూడు ద్విచక్రవాహనాల దొంగతనాలు జరిగాయన్నారు. దీంతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వాహన తనిఖీలను విస్తృతం చేశామన్నారు. బుధవారం ఉదయం డిగ్రీ కళాశాల సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు బైక్ దొంగలు పట్టుబడ్డారన్నారు. వారిని విచారించగా ఒకరిపై పాడేరు, మాకవరపాలెం, కొయ్యూరు, జి.మాడుగుల పోలీసు స్టేషన్‌లో బైక్ చోరీ కేసులు ఆరు, మరో వ్యక్తిపై మూడు కేసులు ఉన్నాయన్నారు. నిందితులనుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు చింతపల్లి, ఒకటి నర్సీపట్నం ప్రాంతానికి చెందిన వ్యక్తుల వాహనాలుగా గుర్తించామన్నారు. ఈ వాహనాలను న్యాయ స్థానం ద్వారా బాధితులకు అప్పగిస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా దేవదాసు

డుంబ్రిగుడ, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా సాగర పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు వంతల దేవదాసు ఎంపిక చేస్తూ కలెక్టర్ దినేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ వర్గాలపై అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. అధికారులను, ప్రజలకు సమన్వయంతో హక్కులపై వారికి అవగాహన కల్పిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

» హైదరాబాద్ రాజేంద్రనగర్ కోళ్ల పరిశోధన సంచాలనాలయం డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ ఛటర్జీ



లంబసింగి ఎఫ్‌పీవో రైతులకు కోళ్ల గూళ్లు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): కోళ్ల పెంపకంతో గిరిజనులు అదనపు ఆదాయం పొందచ్చునని హైదరాబాద్ రాజేంద్ర నగర్ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కోళ్ల పరిశోధనా సంచాలనాలయం డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎన్ ఛటర్జీ అన్నారు. బుధవారం హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కోళ్ల పరిశోధన సంచాలనాలయం శాస్త్రవేత్తలు ఉప ప్రణాళికలో భాగంగా జి.మాడుగుల మండలం దేవరాపల్లి, వీర్లమామిడి, వెన్నలకోట, గొయ్యగుంట, కినగారి, చింతపల్లి మండలం లంబసింగి ఎఫ్‌పీవో పరిధి రైతులకు కోళ్ల గూళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో భాగంగా కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. వ్యవసాయంతోపాటూ కోళ్లను పెంచుకోవడం వల్ల మంచి ఆదాయం పొందచ్చునన్నారు. బ్రీడింగ్ శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పరిశోధనసంచాలనాలయంలో పలు రకాల కోళ్లను అభివృద్ధి చేశామన్నారు. ప్రధానంగా వనశ్రీ, గ్రామప్రియ రకాలు గిరిజన ప్రాంతానికి అత్యంత అనుకూలమన్నారు. పోషణాశాస్త్రవేత్త మాట్లాడుతూ కోళ్ల పోషణపై గిరిజనులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోళ్లకు తెగుళ్ల వ్యాప్తి నిరోధానికి సకాలంలో టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజా కుర్రా, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి, సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కొంగపాకలు ఆశ కార్యకర్త పనితీరుపై ఫిర్యాదు

సీలేరు, మే 28 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని కొంగపాకలు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త ఫాంగి సత్యవరి గత మూడు నెలలుగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం, ప్రసవ సమయాల్లో ఆసుపత్రికి తరలించాలన్నా, ఎవరైనా వ్యాధి బారిన పడి ఆసుపత్రి సిబ్బందికి సమాచారం అందించాలన్నా ఆమె నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ సమస్యను ధారకొండ పీహెచ్‌సీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. విధులను సక్రమంగా నిర్వహించని ఆశా కార్యకర్త సత్యవతిను తొలగించి వేరే వ్యక్తిని నియమించాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. దీనిపై ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు వద్ద ప్రస్తావించగా ఆమెపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తాగునీటి సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

జి.మాడుగుల, మే 28 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సొలభం సర్పంచ్ ఐసారం హనుమంతరావు సూచించారు. పంచాయతీ పరిధి మొండికోట, డబ్బగరువు గ్రామాల్లో నవనిర్మాణ సమితి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన తాగునీటి కుళాయిలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్.చిన్నారావు, వి.జగ్గారావు, శ్రీను, కె.సుబ్బారావు, ఎం.నాగేశ్వరరావు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



సచివాలయ ఉద్యోగి కార్తీక్ ప్రసాద్ కుటుంబానికి నగదు అందిస్తున్న యూనియన్ నాయకులు

పెదబయలు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలో పర్రెడా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జర్సింగి కార్తీక్ ప్రసాద్ మృతిపై రాష్ట్ర ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ యూనియన్ తరపున సంతాపం తెలుపుతున్నట్టు సంఘ జిల్లా కోశాధికారి చాణక్య తెలిపారు. బుధవారం సీతగుంట పంచాయతీ రోగులపేటలో కార్తీక్ ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి యూనియన్ తరపున రూ. 95, 500 అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సహచర ఉద్యోగిని కోల్పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ యూనియన్ నాయకులు బొంజుబాబు, సింహచలం, శివరామయ్య పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నియంత్రణకు చర్యలు

» ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడ ఆదేశం

» గర్భిణులను వారం రోజుల ముందే వసతిగృహాలకు చేర్చాలి

» హైరిస్క్ గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

» వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు, జ్వరాలపై అప్రమత్తం



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఎంజే.అభిషేక్‌గౌడ, పక్కన ఇతర అధికారులు

పాడేరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మాతా శిశు మరణాలను నియంత్రించేందుకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జేసీ అభిషేక్‌గౌడ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలోని 35 పీహెచ్‌సీల వైద్యాధికారులు, మలేరియా అధికారులు, ట్రైబల్ సెల్ వైద్యులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గర్భిణుల నమోదు సక్రమంగా నిర్వహించాలని, ప్రసవ సమయానికి వారం రోజుల ముందుగానే వారిని వసతి గృహాలకు తరలించాలన్నారు. అలాగే హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గతనెలలో జరిగిన ఆస్పత్రి ప్రసవాలు, గృహ ప్రసవాలపై ఆరా తీశారు. కొండ శిఖర గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలో మూడు వైద్య బృందాలను ఏర్పాటు చేసి, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి నవజాత శిశువులకు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే కేజీహెచ్‌లో అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ మద్రేబు గ్రామానికి చెందిన బాలుడు మృతికి గల కారణాలపై ఆరా తీశారు. పాడేరు మండలం ఈదులపాలెం పీహెచ్‌సీ పరిధిలో మలేరియా కేసులు నమోదవుతున్నాయని, అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల భాగ స్వామ్యంతో దోమలమందు పిచికారీ పనులు చేపట్టాలని, మొదటి విడత పిచికారీ పనులు నిర్ధేశించిన గడువు నాటికి పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీలో వర్షాలు కురుస్తున్నాయని వ్యాధులు, మలేరియా జ్వరాలపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షయ బాధితులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడ ఆదేశించారు. అరకులోయ మండలం గన్నెల, పాడేరు మండలం ఈదులపాలెం, మినుములూరు, పెదబయలు మండలంలో గోమంగి, రూడకోట పీహెచ్‌సీల్లోని వైద్యులతో ఆస్పత్రి, గృహ ప్రసవాలపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి తులసి, మలేరియా కన్సల్టెంట్ శ్రీనివాస్, ఏడీఎంహెచ్‌వో టీఎస్.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



అటవీప్రాంతంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్ బృందాలు

అరకులోయ, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచూ అగ్నిప్రమాదాలకు గురయ్యే అటవీ ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల బృంద సభ్యులతో మండలంలోని చినలబుడు ప్రాంతంలో మంగళ, బుధవారాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాడేరు డివిజనల్ అటవీ అధికారి కె. సందీప్‌రెడ్డి మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల నివారణలో మెలకువలపై బృంద సభ్యులు అవగాహన కల్పించారన్నారు. అలాగే, అటవీ సిబ్బందికి మాక్‌డ్రిల్ శిక్షణ అందించారన్నారు. అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ రెండు రోజులూ మాక్‌డ్రిల్ ద్వా రా అటవీ, అగ్నిమాపక సిబ్బంది విపత్తు నిర్వహణలో సమన్వయంతో పనిచేయడం ఎలాగో నేర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి డీఎఫ్‌వో వెంకటనరసింహారావు, , ఎన్ డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమెండర్ కిరణకుమార్, సబ్‌డిఎఫవో ఉమామహేశ్వరి, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌దేయ్ ద్వివేది, నాగేంద్రసింగ్ యాదవ్, ఎస్‌డీ ఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు లావణ్య, వెంకయ్య చౌదరి రాజబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి

'కె. బొడ్డాపుట్టు గ్రామ సమస్యలు పరిష్కరించండి'



కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు సమస్యలు విన్నవిస్తున్న గ్రామస్థులు

పెదబయలు, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కుంతుర్ల పంచాయతీలోని కె. బొడ్డాపుట్టు గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం పాడేరులో కలెక్టర్‌ను అయనను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగ్రామంలో సరైన రహదారి సౌకర్యంలేక నానా అవస్థలు పడుతున్నామన్నారు. అత్యవసర సమయంలో గర్భిణులు, రోగులను ఆస్పత్రికి తరలించాలంటే ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. గ్రామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేక అద్దె ఇంట్లో చిన్నారులకు బోధన చేయాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి భవనానికి తక్షణం మరమ్మతులు చేపట్టే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు,అంగన్‌వాడీ భవన నిర్మాణాలపై మండల అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గున్నిదొర, బాబురావు, రామారావు, భాస్కరరావు, అప్పలరాజు, బాబూజీ, సంజీవరావు, సీతారాముడు, మత్స్యలింగం, శంకరరావు, రాజబాబు,రమేశ్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రీయ పద్ధతుల సాగుతో మిరియాలు అధిక దిగుబడి



రైతులకు ట్రైకోడెర్మ మందును పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు మిరియాల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని అంబాజీపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ నీరజ అన్నారు. బుధవారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు, చింతపల్లి, అంబాజీపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సంయుక్తగా మిరియాల పంట సాగుపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్త నీరజ మాట్లాడుతూ జీవ నియంత్రణ కారకాలతో మిరియాలలో మొదలు కుళ్లు నియంత్రించుకోవచ్చునన్నారు. శాస్త్రవేత్త చెట్టి బిందు మాట్లాడుతూ రైతులు నాణ్యమైన అధిక దిగుబడులునిచ్చే మొక్కలను నాటుకోవాలన్నారు. మిరియాల మొక్కలను జూన్ నుంచి నాటు కోవచ్చునన్నారు. ప్రధాన మొక్కలకు ఇరువైపులా మొక్కలను నాటుకోవాలన్నారు. వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ కాఫీ తోటల్లో మిరియాలను అంతర పంటగా సాగు ద్వారా అదనపు ఆదాయం పొందచ్చునన్నారు. మిరియాల మొక్కల్లో కనింపే పొలుసు పురుగుని సకాలంలో గుర్తించి నివారించుకోవాలన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన రైతులకు ట్రైకోడెర్మ విరిడి మందును పంపిణీ చేశారు. గిరిజన రైతులు పాల్గొన్నారు.

నేడు బొర్రా గుహలు వద్ద యోగాంధ్ర-2025



యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ మాణిక్యం, ఎంపీడీవో ఏవీవీ.కుమార్, తదితరులు

అనంతగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు వద్ద గురువారం యోగాంధ్ర-2025 నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీ మాణిక్యం, ఎంపీడీవో ఏవీవీ కుమార్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ, ఐటీడీఏ పీవో ఇన్‌చార్జి అభిషేక్‌గౌడ్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, తదితరులు పాల్గొనున్నారు. ఈ యోగాంధ్రను మండలస్థాయి అధికారులు విజయవంతం చేయాలని ఆదేశించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

డుంబ్రిగుడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని ఫీల్డ్ అసిస్టెంట్ శాంతి కుమారి అన్నారు. మండల కేంద్రంలో కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఉపాధి పథకం శ్రామికులతో పని ప్రదేశంలో జూన్ 21న యోగా దినోత్సవం పురస్కరించుకుని శ్రామికులతో యోగాసనాలు సాధన వేయించారు. రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు.

రుతుక్రమంపై చైతన్యవంతులు కావాలి: ఎంపీపీ

చింతపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): రుతుక్రమంపై మహిళలు చైతన్యవంతులు కావాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. బుధవారం వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని వాసవ్య మహిళా మండలి సభ్యులు, ఐసీడీఎస్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ కిశోర బాలికలు, మహిళలకు రుతుక్రమంపై సమస్యలు ఎదురైతే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్‌రావు, సీడీపీవో జీవీ రమణ, వాసవ్య మహిళా మండలి కోఆర్డినేటర్ బి. సుబ్బారావు, సూపర్‌వైజర్లు షేక్ ఉన్నీషబేగం, గౌరి, విజయకుమారి పాల్గొన్నారు.

తాటిగుడ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

అనంతగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగుడ జలపాతానికి సుమారు రూ.6 కోట్లతో నిర్మాణం చేపడుతున్న రోడ్డు పనులకు ప్రస్తుతం వర్షాల కారణంగా ఆటంకం నెలకొంది. దీంతో రహదారి చదునుచేసి, వేసిన క్రషర్ బుగ్గి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈస్థితిలో బుధవారం ఉదయం తాటిగుడ గ్రామస్థులు రోడ్డును తాత్కాలికంగా కొంతమేర బాగుచేసుకుని, ప్రయాణాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

కృష్ణాదేవిపేటలో విస్తృతంగా తనిఖీలు

» 30న ఆదివాసీ జంటలకు సామూహిక వివాహ మహోత్సవం

» హాజరు కానున్న చిన్న జీయర్ స్వామి » అప్రమత్తమైన పోలీసులు



డ్రోన్ సాయంతో పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట తంగేటి శ్రీనివాసా కల్యాణ మండపం ఆవరణంలో శుక్రవారం ఉదయం జరగునున్న ఆదివాసీ జంటల సామూహిక వివాహ మహోత్సవానికి చిన్న జీయర్ స్వామి హాజరు కానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా కల్యాణ మండలం ఆవరణలో దానధర్మ, వికాసతరంగిణి నిర్వాహకుల నుంచి బుధవారం నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్. రేవతమ్మ ఏర్పాట్లుపై ఆరా తీశారు. చిన్నజీయర్ స్వామి గురువారం సాయంత్రం ఐదు గంటలకు కృష్ణాదేవిపేటకు రానున్నారని నిర్వాహకులు తెలిపారు. దీంతో ఏజెన్సీ ముఖద్వారమైన భీమవరం పోలీస్ చెక్‌పోస్టు, పల్లావూరు, పాత కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, బంగారంపేట- అంతాడ రహదారి తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. డ్రోన్ కెమెరాల సాయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వాహనాలను సైతనం తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు కృష్ణాదేవిపేట పరిధిలో గత వారం రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నాలుగు బెల్ట్ షాపులపై దాడిచేసి నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. అలాగే వారపు సంతలో నిబంధనలకు విరుద్ధంగా ర్యాష్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ చేస్తున్న రెండు ఆటోలపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఆమె వెంటన ఎస్ఐ వై.తారకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రైవేటు ట్రావెల్ బస్సుపై చర్యలు

» పర్మిట్ లేకుండా నడుపుతుండడంతో అడ్డుకున్న ఆర్టీసీ డీఎం



బస్సును అడ్డుకున్న డీఎం, సిబ్బంది

నర్సీపట్నం, మే 28(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నర్సీపట్నం నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్, సిబ్బంది అడ్డుకున్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ పక్కన శారదానగర్ రోడ్డులో ప్రైవేటు ట్రావెల్ బస్సు నిలిపి హైదరాబాద్ ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా డిపో మేనేజర్, సిబ్బంది అడ్డుకున్నారు. పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ధీరజ్ మాట్లాడుతూ అరుణాచల్ రాష్ట్రం రిజిస్ట్రేషన్‌తో ఉన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు పర్మిట్ లేకుండా, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా తిప్పుతున్నారని ఆరోపించారు. టూరిస్ట్ పర్మిట్‌తో స్టేజి క్యారింగ్ చేస్తున్నారని తెలిపారు. దీనిపై నర్సీపట్నం ఆర్టీవోకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. నిబంధనల ప్రకారం డిపోకి రెండు కిలోమీటర్ల పరిధి లోపు ప్రైవేటు బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని చెప్పారు. డిపో దగ్గర బస్సు ఆపి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ డిపో మేనేజర్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు యజమాని డిపో మేనేజర్‌కి ఫోన్ చేసి ఇకపై నర్సీపట్నం నుంచి బస్సు నడపబోమని చెప్పడంతో విడిచి పెట్టారు.



గొలుగొండ మండలం కొమిర గ్రామంలో ఎన్టీఆర్ జయంతిలో టీడీపీ నాయకులు



ఏఎల్‌పురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

తెలుగుజాతి కీర్తి కిరీటం ఎన్టీఆర్

» జయంతి సందర్భంగా వాడవాడలా టీడీపీ శ్రేణులు నివాళి



నాతవరం మండం జిల్లేడిపూడిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణుల జోహార్లు



మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెంలో...

నర్సీపట్నం, మే 28(ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు జయంతిని బుధవారం ఆపార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడకను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రకటించిన నేపథ్యంలో ఇక్కడి మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సరేంద్ర, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, గ్రంథాలయాధికారిణి దమయంతి తదితరులు నివాళులర్పించారు. అలాగే, పలుచోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

గొలుగొండ మండలంలో...

గొలుగొండ : మండలంలోని గ్రామ గ్రామాన ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. గొలుగొండ , కొమిర, పాకలపాడు, గుండుపాల, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, పాతమల్లంపేట, కొత్తమల్లంపేట గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి నాయుడు, కామిరెడ్డి గోవింద్, రాయపురెడ్డి చిట్టిబాబు, పోతిన లోవ, కొమరవోలు చిట్టిబాబు, కూరాకుల నాయుడులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : తెలుగుజాతి కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. ఏఎల్‌పురం, కొంగసింగి, లింగంపేట, సీహెచ్‌నాగాపురం, చోద్యం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొలుగొండ మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, నాయకులు బొడ్డు జమీల్, గొంప వాసు, లగుడు రమేష్, రాజు, చిట్టిబాబు, పైల రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండలంలో...

మాకవరపాలెం : ఎన్టీఆర్ జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు పండగలా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రామన్నపాలెం,తూటిపాల, లచ్చన్నపాలెం గ్రామాల్లో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ అడుగుజాడల్లో ప్రతి కార్యకర్త నడుచుకోవాలన్నారు. సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, పోతల రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాతవరం మండలంలో...

నాతవరం : ఎన్టీఆర్ జయంతి తెలుగు రాష్ట్రాల ప్రజలకు పండుగ వంటిదని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా నాతవరంలో టీడీపీ మండల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇటు కళారంగానికి ఎనలేని సేవలందిస్తూనే, ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో చక్కని పాలన అందించారని కొనియాడారు. అలాగే జిల్లేడిపూడి, యర్రవరం తదితర గ్రామాలలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో కూడా సిబ్బంది ఎన్టీఆర్ జయంతిని జరిపారు. ఈ వేడుకల్లో పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, కొండబాబు, నాయకులు పైల సూరిబాబు, సన్యాసిదేముడు, అప్పిరెడ్డి మాణిక్యం, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, మండల తెలుగుయువత అధ్యక్షుడు శెట్టి పారుపల్లి దాసు లోవ, శెట్టి నానాజీ, చింతకాయల శ్రీనివాస్, బంగారు సూరిబాబు, సామర్ల రామారావు, జిల్లేడిపూడి టీడీపీ నాయకులు కోరుప్రోలు వెంకటేష్, లాలం రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్‌పై తొలుత అనర్హత వేటు?

» వరుసగా మూడు నెలలు కౌన్సిల్ సమావేశానికి రాని వైస్ చైర్మన్ 'తమరాన'

» వ్యక్తిగత కారణాలతో రాలేకపోయానని వివరణ

» మొదటి తప్పుగా భావించి కొనసాగింపునకు నిర్ణయం

నర్సీపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలు వరుసగా కౌన్సిల్ సమావేశానికి హాజరుకాని పెదబొడ్డేపల్లి 13వ వార్డు వైసీపీ కౌన్సిలర్, మునిసిపల్ వైస్ చైర్మన్-2 తమరాన అప్పలనాయుడుపై కౌన్సిల్ సభ్యునిగా కొనసాగడానికి అనర్హత వేటు పడింది. ఈ మేరకు ఈనెల 2వ తేదీన ఆయనకు లిఖపూర్వంగా మునిసిపల్ అధికారులు నోటీసు ఇచ్చి తెలియజేశారు. వ్యక్తి గత కారణాలతో వరుసగా మూడు కౌన్సిల్ సమావేశాలకు రాలేకపోయానని, తన కౌన్సిల్ సభ్యత్వాన్ని కొనసాగించాలని లిఖిత పూర్వకంగా అప్పలనాయుడ వివరణ ఇచ్చారు. దీంతో మొదటి తప్పుగా భావించి కౌన్సిల్ సభ్యునిగా సాగించడానికి నిర్ణయం తీసుకుంటూ అజెండాలో పెట్టారు. గురువారం జరగనున్న కౌన్సిల్ సమావేశం అజెండాలో మొదటి అంశంగా తమరాన అనర్హత వేటు, తర్వాత కొనసాగించిన అంశాన్ని చేర్చారు.

అల్లూరి పార్కును సందర్శించిన ఆర్డీవో

కృష్ణాదేవిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో యోగా డే నిర్వహణకు బుధవారం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ పార్కును సందర్శించారు. పార్కులో యోగా చేసేందుకు వీలుగా అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా డే సందర్భంగా యోగా కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో చేస్తున్నందున ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీ రోజ్, ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాస్, ఆర్ఐ నాగరాజు, సర్పంచ్ లోచల సుజాత, టీడీపీ నాయకులు బొడ్డు జమీల్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నర్సీపట్నం, మే 28(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా మాసోత్సవాలు మునిసిపాలిటీలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్థానిక నలంద ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో యోగసనాలు శిక్షణ తరగతులు జరిపారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని కమిషనర్ సురేంద్ర తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో రిసోర్స్ పర్సన్ సందీప్ ఆధ్వర్యంలో 24 ఆసనాలు మీద శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్‌డీ రమాకుమారి ఆధ్వర్యంలో అయ్యన్నపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమణబాబు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం : యోగా చేయడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని ఎంపీడీవో సుధ అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుతూరులోని ప్రైవేటు కల్యాణ మండలంలో వివిధ శాఖల ఉద్యోగులతో బుధవారం యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె యోగా ఆవశ్యకతను వివరించారు. ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ : యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని ఎంపీడీవో మేరీ రోజీ అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటైన యోగా శిక్షణ శిబిరంలో మాట్లాడారు.ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

1న ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు డీఎస్సీ మోడల్ టెస్ట్



ఎంవీ స్వామి, పీఆర్‌టీయూ అధ్యక్షులు

చోడవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో డీఎస్సీ అభ్యర్థులకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మోడల్‌టెస్ట్ ఉచి తంగా నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు ఎంవి.స్వామి, ప్రధాన కార్యదర్శి గణేశ్వరరావు బుధవారం తెలిపారు. విశాఖ నగర పరిధిలోని అభ్యర్థులకు గోపాలపట్నం జడ్పీ హైస్కూల్‌లో, అనకాపల్లి అభ్యర్థులకు మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్, నర్సీపట్నం ప్రాంత అభ్యర్థులకు నర్సీపట్నం జడ్పీ హైస్కూల్‌లో, అల్లూరి జిల్లా వారికి పాడేరు గవర్నమెంట్ హైస్కూల్‌లోను ఈ పరీక్షలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ మోడల్ పరీక్ష వివరాలకు ఫోన్లు: 998505 5099, 98493 67678 సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

'మహానాడులో బ్రాహ్మణ సంక్షేమంపై తీర్మానం హర్షనీయం'

చోడవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి అవసరమైన తీర్మానాలు మహానాడు ముసాయిదాలో చేర్చడంపై ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రీయ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.వి. ఎస్. ఆర్ . మూర్తి(విన్ను) బుధవారం హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణుల ప్రగతికి ప్రత్యేకంగా కార్పొరేషన్ స్థాపించి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు నాందిపలికిన చంద్రబాబు హయాంలోనే, మరోసారి తమ సామాజిక వర్గానికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

మాడుగుల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 15 వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు అన్నారు. ఈమేరకు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 31 వ తేదీ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు పెండ్లిరాట వేస్తామన్నారు. జూన్ 11 తేదీ వరకు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణబాబు, కమిటీ సభ్యులు అప్పలనాయుడు, రాంబాబు, బలరాం, యల్లపురాము, సునీల్, టి.శ్రీను ఆలయ అర్చకులు సుదర్శనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ

బుచ్చెయ్యపేట మే 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో యోగా ట్రైనర్ల శిక్షణ బుధవారం రెండో రోజు కొనసాగింది. ఆయుర్వేద వైద్యాధికారి రామలక్ష్మి, వ్యాయామాలు, ప్రాణాయామం, ధాన్యం, సాధన చేయించారు. 22 పంచాయతీల సిబ్బంది ,ఆశ కార్యకర్తలు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి,మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కందిపూడి గ్రామ హెల్త్ క్లినిక్‌లో 8 ఏళ్లనుంచి 18 సంవత్సరాల వయస్సు వారితో యోగా సాధన చేయించారు.

చీడికాడ: మండలంలోని జి.కొత్తపల్లి కేజీబీవీలో బుధవారం రెండవ రోజు యోగాసనాలు చేశారు. ఎంపీడీవో వి.హేమసుందరరావు, టీవోటీలు వై.ఈశ్వరబాబు, ఆర్.సింహాచలం, నాయుడు, మానస, పట్నాల గోపి, ఈ వోపీఆర్‌డీ ఎం.కామేశ్వరరావు, పట్నాల గోపి, సన్యాసిరావు, తదితరులు యోగాసనాల ప్రాధాన్యతను వివరించారు.

ఉపాధి వేతనాల కోసం ఆందోళన

రోలుగుంట, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి బకాయిలు చెల్లించాలంటూ బుధవారం మండలంలోని పనసలపాడు, లోసింగి గ్రామాల్లో శ్రామికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, మూడు నెలలుగా కూలీల డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. దీంతో వీరి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వారం రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే పీడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



వెంకన్నపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



రావికమతంలో ..



కె. కోటపాడులో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట నాయకులు

పేద ప్రజల గుండె చప్పుడు ఎన్టీఆర్

» ఘనంగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి

చోడవరం, మే 28, ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ ఆర్ జయంతి వేడుకలు బుధవారం మండలంలోని వెంకన్నపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి రమణ తదితరులు ఎన్టీ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉరిగిటి శ్రీనివాస్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కె. కోటపాడులో..

కె.కోటపాడు: ఎన్టీ రామారావు ఆశయాలకు అనుగుణంగా పేదలకు సేవలందిస్తామని స్థానిక మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్థానిక మూడురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఈర్లీ రమేశ్ సన్మానించారు. నీటి సంఘం అధ్యక్షులు పైలా గంగునాయుడు, డోకల సన్యాసినాయుడు, రెడ్డి అప్పారావు, చిరంజీవి, అబద్ధం, బి. త్రినాథ్, గండిబోయిన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం: తెలుగు జాతి గుండెల్లో సుస్థిర స్థానం పొందిన మహోన్న నాయకుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని పలువురు వక్తలు కొనియాడారు. రావికమతంలో గొంప ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పలూరి నాగేశ్వరావు, గంజి ఈశ్వరావు, కె.కృష్ణమూర్తి, వేపాడ గంగరాజు తదితరులు ఎన్టీఆర్ వి గ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళలర్పించారు. కొత్తకోటలో యువనాయకులు కోట దొరబాబు,ప్రకాశరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళలర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి,స్వీట్లు పంచారు. పేదలకు దుస్తులు, ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి:స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్టీ రామారావు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీ దేవి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వేరులు గఫూర్, గోవిందరాజులు, వీఆర్వోలు పాల్గొన్నారు.వేచలం గ్రామంలో నిర్వహించి జయంతిలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి శ్రీలక్ష్మి, బలరాం, రెడ్డి సాయి, మల్లు నాయుడు, రెడ్డి శ్రీను, నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల మండలంలో..

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాలో నందమూరి తారక రామారావు (ఎన్‌టిఆర్) జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేజేపురంలో స్థానిక టీడీపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు మైనర్‌బాబు, శివకుమార్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టీడీపీ నేత దొండా గిరిబాబు ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణి చేశారు బంగారు మెట్ట, వడ్డాది దిబ్బిడి, బుచ్చెయ్యపేట, తురకలపూడి,రాజాం, తదితర గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకర లక్ష్మి, దొండా గిరిబాబు, ఎంపీటీసీ సభ్యులు యల్లపు జగ్గ, దొండ రమేశ్, సయ్యపు రెడ్డి శ్రీనివాసరావు, సింగంపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

చీడికాడ: బడుగు బల హీనవర్గాల ఆశాజ్యోతి ఎ న్టీ రామారావు అని కోనాం జలా శయం మాజీ చైర్మన్ గండి ముసలినాయుడు అన్నారు. చీడికాడలో జయంతిలో మాట్లాడారు. దిబ్బపాలెంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు.



చీడికాడలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వడ్డాదిలో వస్త్ర దానం చేస్తున్న నాయకులు



మాడుగులలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి



దేవరాపల్లి: వేచలంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహానాడులో చోడవరం నేతల సందడి

చోడవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): మహానాడులో రెండవ రోజైన బుధవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఇతర టీడీపీ నాయకులు సందడి చేశారు. నియోజకవర్గం నుంచి తరలివెళ్లిన నేతలు మహానాడులో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ వేడుకలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నాయకులు కనిశెట్టి మత్స్యరాజు, సకురు కోటేశ్వరరావు,శివాలయం కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, ఇతర నేతలు పాల్గొన్నారు.

సైనిక్‌స్కూల్‌కి చీడికాడ విద్యార్థి ఎంపిక



దీపు సాత్విక్

చీడికాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పుట్టా దీపు సాత్విక్ కోరుకొండ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. దీపు 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాశాడు. 300 మార్కులకి గాను 280మార్కులు సాధించి విశాఖ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్టు తల్లిదండ్రులు తెలి పారు. గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు విద్యార్థిని అభినందించారు.

20 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



గంజాయి నిందితులతో సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రామకృష్ణారావు

రోలుగుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరం-కొంతలం మధ్యలో బుధవారం తెల్లవారుజామున 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్టు స్థానిక సీఐ కోటేశ్వరరావు తెలిపారు. ముందుస్తు సమాచారం మేరకు ఎస్ఐ రామకృష్ణారావు, సిబ్బందితో శరభవరం జంక్షన్ వద్ద నిఘా పెట్టారు. ఓ కారును ఆపి తనిఖీలు చేపట్టగా.. 20 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. మదనపల్లికి చెందిన పట్నం సురేశ్, బంటుపల్లి కళ్యాణ్, కర్నాటక రాష్ట్రానికి చెందిన వి.గౌతమ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నారు.

కనకదుర్గ ఆలయానికి శంకుస్థాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): వాకపల్లిలో కనకదుర్గ ఆలయ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం జరిగింది. అర్చకుడు పాకల కామేశ్వరరావు శర్మ ఉదయం నుంచి గ్రామస్థులతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు.



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం



మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.







మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు







నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ



అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే...



కార్యకర్తల ఉత్సాహం..



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



పోలీసు తనిఖీలు

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

అనంతగిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం శైడ-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ట్రాక్‌పై 53/34 కిలోమీటర్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బండరాళ్లు జారిపడ్డాయి. అదే సమయంలో కిరండూల్ నుంచి ఐరన్ ఓర్‌తో విశాఖపట్నం వస్తున్న గూడ్స్ రైలు వాటిని ఢీకొని పట్టాలు తప్పినట్టు చెబుతున్నారు. గూడ్స్ పట్టాలు తప్పడంతో కేకే లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం కూడా రైళ్లను రద్దు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

కేకే లైన్‌లో రైళ్లు రద్దు

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి): కేకే లైన్‌లో కిలోమీటరు 53/54 వద్ద బండ రాళ్లు పడి రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో 18516 నంబరు కిరండోల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం కొరాపుట్, రాయగడ మీదుగా విజయనగరం మళ్లించినట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. అదే విధంగా 58501 విశాఖపట్నం - కిరండోల్ పాసింజర్ రైలు 29వ తేదీన, తిరుగు ప్రయాణంలో 58502 కిరండోల్ - విశాఖ రైలు రద్దు చేశారు.

కొండకర్ల ఆవకు మహర్దశ

... 3వ పేజీ తరువాయి

ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

పూర్తిగా పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వంలో ఈ లోవను ఏ మాత్రం పట్టించుకోలేదు. రిపేర్, రినోవేషన్ అండ్ రీస్టోరేషన్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ జలవనరును ఆధునికీకరించడానికి అప్పటి అనకాపల్లి ఎంపీ సత్యవతి చొరవతో కేంద్ర ప్రభుత్వం 2021లోనే ముందుకొచ్చింది. కానీ జగన్ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఆవ పరిస్థితి అలాగే ఉంది. దశాబ్దాలుగా ఆవ ఆధునికీకరణ ఊసెత్తకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యంలో 50 శాతానికి పైగా కోల్పోయింది. కూటమి ప్రభుత్వం లోవ అభివృద్ధికి చర్యలు తీసుకుంటుండడంతో ఈ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రంగబోలు గెడ్డ పరిశీలన

- మట్టి తవ్వకాలను పరిశీలించిన తహసీల్దార్, పోలీసులు
- వాహనాలు స్వాధీనం, కేసు నమోదు



రంగబోలు గెడ్డలో మట్టి తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

కశింకోట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న కొత్తబుచ్చెయ్యపేటలోని రంగబోలు గెడ్డలో మట్టి తవ్వకాలపై రెవెన్యూ, పోలీసులు స్పందించి అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిని తీసుకు వెళ్లి బుధవారం పరిశీలించారు. దీనిపై రైతాంగం కూడా పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి అధికారులు తీసుకున్న చర్యలను స్వాగతిస్తున్నారని సీఐ అల్లు స్వామినాయుడు, తహశీల్దార్ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మట్టి తవ్వకాలకు ఉపయోగించిన వాహనాలను అదుపులోకి తీసుకొని బాధ్యులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. పర్యావరణకు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే పనులు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, వీఆర్‌వో శ్రీనివాసరావు ఉన్నారు.

రక్షించడానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- సముద్రంలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించబోయి యువకుడి మృతి



షేక్ ఇషాక్ మదీనా వల్లి మృతదేహం

ఎస్. రాయవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో మునిగిపోతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రక్షించడానికి వెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని రేవుపోలవరం సముద్రం తీరం వద్ద చోటుచేసుకొంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన షేక్ అహ్మదుల్లా తన ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ కోసం అదే గ్రామానికి చెందిన షేక్ ఇషాక్ మదీనా వల్లి(20), షేక్ ఆలీషా అనే యువకులతో కలిసి ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సముద్రతీరం వద్దకు వెళ్లాడు. సముద్ర తీరం వద్ద ఫొటో షూట్ జరుగుతుండగా అక్కడ స్నానం చేస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ మునిగిపోతుండడంతో అతని కుటుంబ సభ్యులు కేకలు వేశారు. ఫొటో షూట్‌కు వచ్చిన వారిలో షేక్ మదీనా వల్లి, షేక్ ఆలీషా ఆ మునిగిపోతున్న వ్యక్తిని కాపాడడానికి సముద్రంలోకి వెళ్లారు. ఆ వ్యక్తిని షేక్ ఆలీషా ఒడ్డుకు తీసుకురాగా అతనితో పాటు వెళ్లిన షేక్ ఇషాక్ మదీనా వల్లి మునిగిపోయాడు. గస్తీ నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారులు ఇషాక్ మదీనా వల్లిను ఒడ్డుకు తీసుకు వచ్చి పరిశీలించగా అప్పటికే స్పృహ కోల్పోయి ఉన్నాడు. అతనిని నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించినట్టు ఎస్ఐ చెప్పారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు గ్రేడ్ -2 హెచ్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్

విశాఖపట్నం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ గురువారం ఉదయం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో నిర్వహించనున్నట్టు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

హెచ్‌ఎంల బదిలీ ఉత్తర్వులు వెలువడిన తరువాత మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. పదోన్నతుల కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసిన వారంతా తమ రిజిస్టర్ మొబైల్ నంబర్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

... 3వ పేజీ తరువాయి

కారణమని పేర్కొన్నారు. ఆడ పిల్లలకు తండ్రి ఆస్తిలో హక్కు, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చేసిన సేవలకు గుర్తింపుగా భారతరత్న ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీనికోరారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు, సబ్ జైలులో ఖైదీలకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు ఛైర్మన్ కరక సత్యనారాయణ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తామని కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లాలోని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించినట్టు ఆమె తెలిపారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జి.మాడుగుల, మే 28 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల- చింతపల్లి ప్రధాన రహదారిలో కొక్కిరాపల్లి మలుపుల వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీకేవీధి మండలం పాము రాయి గ్రామానికి చెందిన పాంగి జుంబే, తన భర్త రాజుతో పాటు బంధువైన పాంగి బందురుతో బైక్‌పై ఒడిశా వెళ్లి తిరిగి వస్తున్నారు. కొక్కిరాపల్లి ఘాట్‌లో భద్రాచలం నుంచి విజయనగరం వెళుతున్న పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న పాంగి జుంబే (52) బస్సు టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడిపిన బందురు, జుంబే భర్త స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మృతురాలి భర్త పాంగి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెదురుపర్తిలో అదుపుతప్పి ఆటో బోల్తా

- ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు

కశింకోట, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదురుపర్తి గ్రామ శివారున ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న అరటితోటలోకి దూసుకెళ్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. సంపతిపురం పంచాయతీ టి.వెంకుపాలెం నుంచి అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేసేందుకు రోజూ మాదిరిగానే ఆటోలో లక్ష్మి, వెంకట్రావు, రమణ, సతీష్, గోవింద వీరు ఐదుగురూ కలిసి వెళుతున్నారు. అయితే మార్గ మధ్యంలో వెదురుపర్తి శివారుకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న అరటితోటలోకి ఆటో దూసుకెళ్లి బోల్తా పడింది. ఆటోలో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఎవరి ఇళ్లకు వారిని పంపివేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంతో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు

నక్కపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత గ్రామం వద్ద బుధవారం బైక్‌ను వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. దీనికి సంబంధించి నక్కపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన పప్పుల సత్యనారాయణ నక్కపల్లి మండలంలోని హెటిరో కంపెనీలో పనిచేస్తూ మండలంలోని కాగిత గ్రామంలో నివాసముంటున్నాడు. బుధవారం అతను కాగిత గ్రామానికి చెందిన పొల్నాటి లక్ష్మణరావుతో కలిసి బైక్‌పై అడ్డురోడ్డు వైపు వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన పప్పుల సత్యనారాయణకు నక్కపల్లి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖపట్నం కేర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న పొల్నాటి లక్ష్మణరావుకు స్వల్ప గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోవడంతో సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకుని సీజ్ చేశామని, వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని నక్కపల్లి పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539